భక్తి శ్రద్ధలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారిని రథంపై పురవీధులలో ఊరేగింపు చేశారు. వంశపారంపర్య చైర్మన్ రాజా గోపాల్ సైన్‌దార్ కరవాలంతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్య నిర్వాహణ అధికారి మఠం వీరేశం, శివ రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యాపారులు సమాజ సేవలో పాల్గొనాలి



వర్తక సంఘం కేలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

రామంతాపూర్ : రామంతాపూర్ వర్తక సంఘం రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు పారిశ్రామికవేత్తలు తమ లాభాల్లో కొంత భాగం సమాజంలో ఆపదలో ఉన్న అభాగ్యులను పేద విద్యార్థులను ఆదుకోవాలని సూచించారు. సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, కోశాధికారి సంబు పాండయ్య, సత్యనారాయణ, హరిబాబు, వెంకటేశ్వర్లు, శంకర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



రామంతాపూర్ : తెలంగాణ గంగపుత్రుల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామంతాపూర్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రచ్చ రఘు, ప్రధాన కార్యదర్శిగా మాడవేడి వినోద్‌కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఆలయ శ్రీనివాసులు పాక వెంకట్ రాజన్న రాజ్యలక్ష్మి నిరూపమ శ్రీపతి ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన గంగపుత్ర రాష్ట్ర ఉద్యోగుల సంఘం సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అలరించిన భరత నాట్యం



ఉప్పల్: ఉప్పల్ మిని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సాహితి అజ్జరపు శిష్య బృందం నిర్వహించిన భతరనాట్య ప్రదర్శిన అలరించింది. కళాకారులు తక్షక, శ్రీరెను, డామిత, గీతికా, ఆద్య, నివియన్షి, రేష్మి, రుత్వక, రేయాంశలు ప్రదర్శించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



రామంతాపూర్ : మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శి రేవు నరసింహ గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం పాత రామంతాపూర్‌లో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, పరందామ, నాగేష్, గణేష్ యాదవ్ పాల్గొన్నారు.

శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు అక్షింతల ర్యాలీ



కుషాయిగూడ: అయోధ్య నుండి వచ్చిన అక్షింతలతో సోమవారం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర కుషాయిగూడ ట్రస్టు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కుషాయిగూడ శ్రీ శివాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కుషాయిగూడ వీధుల గుండా కొనసాగింది. ర్యాలీలో విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్, ఎబీవీపీ, బీఎంఎస్, బీజేపి నాయకులు పాలుపంచుకున్నారు. స్వామి వారి అక్షితలను జనవరి -1 నుంచి 15 తేది వరకు కాప్రా సర్కిల్ కార్యాలయం వేదికగా పంపిణి చేయనున్నట్లు తెలిపారు.

వ్యాపార సముదాయంలో అగ్ని ప్రమాదం

ఉప్పల్: ఉప్పల్‌లోని వరంగల్ ప్రధాన రహదారిలో ఉన్న ఆప్టికల్ వ్యాపార సముదాయంలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉప్పల్ గాంధీ బొమ్మ నుంచి ఉప్పల్ రింగ్ రోడ్డు వైపు ఉన్న ఓం సాయి ఆప్టికల్ షాపులో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మంటలు మొదటి అంతస్తుకు చేరుకోవడం భారీగా పొగ, రావడంతో స్థానికులు అప్రమత్తమై ఉప్పల్ పోలీసులకు, ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పింది. షాపును బంద్ చేసి వెళ్లిన కొద్ది సేపటికే మంటలు అంటుకోవడంతో మొదటి అంతస్తు దాదాపుగా పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. షాపు యాజమాని అందుబాటులో లేనందువల్ల నష్టం ఎంత వరకు వాటిల్లిందనే విషయం వెల్లడవనుంది.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చిలుకానగర్ జేసీపీసీ మినిస్ట్రీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు



మల్లికార్జు నగర్ వెస్లీ చర్చిలో..



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

ఉప్పల్: క్రిస్మస్ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పలు చర్చీల్లో ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్టియన్ సోదరులు భక్తి శ్రద్ధలతో చర్చీల్లో ప్రార్థనలు నిర్వహించారు. చిలుకానగర్ డివిజన్‌లోని ఏజి , జేసీపీసీ మినిస్ట్రీ చర్చీలలో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గాంధీనగర్‌లో..

ఉప్పల్ గాంధీనగర్‌లోని జేరుసలేం చర్చిలో మత్తయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఉప్పల్ జీహెచ్ఎంసి కార్మికులకు దుస్తులను అందజేసారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించుకున్నారు

గౌతంనగర్: మల్కాజిగిరి జోన్ పరిధిలో సోమవారం క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్వాల్, మల్కాజిగిరి, మచ్చబొల్లారం, వెంకటాపురం, నేరేడ్‌మెట్, గౌతంనగర్, వినాయక్‌నగర్, మౌలాలి తదితర డివిజన్‌లలో ఉదయం నుండి క్రైస్తవ సోదరులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు చర్చిల్లో సోమవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. నగర మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.



టీచర్స్‌కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి..



చక్రిపురం చర్చిలో..



దయానంద్‌నగర్ గిఫ్ట్ చర్చిలో..



ఓల్డ్ అల్వాల్ స్నేహ కాలనీలో



నేరేడ్‌మెట్ స్వాగత్ ఫంక్షన్ హాల్‌లో..

శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి



సాయిరెడ్డినగర్ శ్మశానవాటిను సందర్శించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్‌లోని సాయిరెడ్డి కాలనీలో ఉన్న హిందూ స్మశానవాటిను స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సోమవారం సందర్శించారు. శ్మశాన వాటికలో మొత్తం చెత్త, నిరుపయోగంగా పదార్థాలను డంప్ చేయడం వల్ల చుట్టు పక్కల ఉన్న 15 కాలనీ వాసులు దుర్గంధ భరితమైన వాసన, దోమలు చేరడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు వెంటనే ఫోన్‌లో మాట్లాడి స్మశాన వాటికలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డోలి రమేష్, పరమేష్, పవన్‌కుమార్, సతీష్, నాగేందర్, జానకీరామ్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఉప్పల్: అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న స్థావరంపై మల్కాజిగిరి ఎస్‌ఓటి పోలీసులు దాడి చేసి వారి వద్ద నుంచి గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఉప్పల్ గాంధీనగర్‌లో ఆటో డ్రైవింగ్ చేసే ఆనంద్ సింగ్(33) డ్రైవింగ్‌తో పాటు డొమెస్టిక్ సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్ల లోకి ప్రమాదకరంగా జనవాసాల్లో గ్యాస్ నింపుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు స్థావరం పై దాడి చేసి అతని వద్ద నుంచి 8 చిన్నవి, రెండు పెద్ద గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని ఉప్పల్ పోలీసులకు కేసును అప్పగించారు.

డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించొద్దు



ఘట్‌కేసర్: డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపించొద్దని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని నాలుగో వార్డు మారుతీనగర్‌లో రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి నెలా నిర్వహణ చార్జీలు చెల్లించాలి



ఘట్‌కేసర్: కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చౌదరిగూడ వెంకటసాయి నగర్ ఎకో ఫ్రెండ్లీ టౌన్‌షిప్-1 అధ్యక్షుడు గుర్రాల పార్థీవరెడ్డి అన్నారు. చౌదరిగూడ వెంకటసాయి నగర్ ఎకోఫ్రెండ్లీ టౌన్‌షిప్-1లో కాలనీ అభివృద్ధిపై సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో శాంతి భద్రతల కాపాడడానికి సీసీ కెమరాల ఏర్పాట్లు, కాలనీలోని కోతులను తరిమేయడానికి, సీసీ రోడ్లు నిర్మాణంతో పాటు ఇతర మౌళిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతి నెల నిర్వాహణ చార్జీలు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో అద్దెకు

మేడ్చల్ రూరల్: తప్పుడు అగ్రిమెంట్ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో మేడ్చల్ పట్టణంలోని టీఎన్జీఓఎస్ భవనాన్ని అద్దెకు తీసుకున్నట్లు మద్యం దుకాణం లైసెన్స్ పొందిన ఇద్దరిని మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మురళీధర్ తెలిపిన మేరకు.. మేడ్చల్ పట్టణంలో గల టీఎన్జీవోస్ భవనాన్ని 2021 నవంబర్ నెలలో మేడ్చల్ పట్టణంలోని వెంకట్రామయ్య కాలనీలో నివాసం ఉండే నాగరాజుగౌడ్, కర్నూలుకు చెందిన పరమేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తులు అద్దెకు తీసుకున్నారు. అందులో మద్యం దుకాణం నిర్వహించేందుకు నాగరాజుగౌడ్ ఆ భవన యజమాని అన్నట్లుగా తప్పుడు పత్రాలు రూపొందించి సాయి మహేశ్వరీ పేరుతో మద్యం దుకాణం నిర్వహించేందుకు పరమేశ్వర్‌రెడ్డికి అద్దెకు ఇస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించాడు. పరమేశ్వర్‌రెడ్డి ఆ పత్రాలను జిల్లా ఎక్సైజ్ అధికారులకు చూపి మద్యం దుకాణం లైసెన్సులు పొందాడు.

2023 నవంబర్ తో భవనం అగ్రిమెంట్ పూర్తవ్వగా నాగరాజుగౌడ్, పరమేశ్వర్‌రెడ్డి అద్దె చెల్లించకుండా, భవనాన్ని ఖాళీ చేయకపోవడంతో మేడ్చల్ జిల్లా టీఎన్జీవోస్ సంఘం సభ్యులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. తప్పుడు అగ్రిమెంట్ సృష్టించి మద్యం దుకాణ అనుమతులు పొందారని, తమ సంతకాలను ఫోర్జరీ చేశారన్న విషయం తెలుసుకున్న టీఎన్జీవోస్ నేతలు వారిపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు రవిప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు ఈ మేరకు నాగరాజు గౌడ్, పరమేశ్వర్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

ఉచిత కంటి శిబిరం



కాప్రా: క్రిస్మస్ సందర్భంగా ప్రేమ ఐ కేర్ ఆధ్వర్యంలో సోమవారం ఏఎస్‌రావునగర్‌లో ఉచిత కంటి చికిత్స వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 350 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య నిపుణులు డాక్టర్ ఎంఎస్.మిట్టా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాష్యం వార్షికోత్సవం



కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని మహేష్ నగర్‌లో గల భాష్యం స్కూల్ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. గత రెండు రోజులుగా కొనసాగిన ఈ వార్షికోత్సవాల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. జోనల్ అధికారి మార్కెండేయులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం కేలండర్ ఆవిష్కరణ



మల్లాపూర్: మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీ వద్ద గల అశోక్‌నగర్ వడ్డెర సంఘం 2024 నూతన సంవత్సర కేలండర్‌ను సంఘం నాయకులు ఆవిష్కరించారు. అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, నర్సింహ, వెంకటేష్, యాదయ్య, ఎల్లయ్య, బాబురావు, ఈరయ్య తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ క్లీనప్ క్యాంపెయిన్



కాప్రా: క్రిస్మస్ సందర్భంగా వరల్డ్ మిషన్ సొసైటీ చర్చి ఆధ్వర్యంలో సోమవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ జైజవాన్ కాలనీలో క్లీనప్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి పాల్గొన్నారు.

భారత్ సంకల్పయాత్ర

ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరూ ఒకే విధంగా బతకాలనేదే భారత్ వికాస్ సంకల్పయాత్ర లక్ష్యమని ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన వికాసిత్ భారత్ సంకల్పయాత్ర సోమవారం మండల పరిధిలోని కొర్రెముల్, ప్రతాపసింగారం గ్రామాలలో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... భారతదేశంలోని నిరుపేదలకు, రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలను ప్రవేశపెట్టారన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ హోం మంత్రి మహమూద్‌అలి

అల్వాల్: మల్కాజిగిరి డివిజన్‌లోని పార్టీలకు అతీతంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని బురాని కాలనీలో కమ్యూనిటీకి అవసరమయ్యే వంటశాల గది నిర్మాణ పనులను మాజీ హోం మంత్రి మహమూద్‌అలి, కార్పొరేటర్ సబితకిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా కృషి చేస్తానన్నారు. బురాని కమ్యూనిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

రామంతాపూర్ : భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ 99వ జయంతి వేడుకలు రామంతాపూర్‌లో సోమవారం బీజేపీ నేతలు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెన్సార్‌బోర్డు మెంబర్ జగదీష్, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సంకోరి కుమారస్వామి, నారాయణదాసు పాల్గొన్నారు.

మౌలాలి: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ రాచందర్‌రావు అన్నారు. సోమవారం వాజ్‌పేయి 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి విగ్రహానికి వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మీతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.





పురపాలికల్లో పన్నుల వసూళ్లపై దృష్టి

- స్పెషల్ డ్రైవ్‌లో ఇంటింటికీ ప్రత్యేక బృందాలు
- మార్చి 31 వరకు వంద శాతం పన్నుల వసూళ్లపై కార్యాచరణ
- గడువు లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు
- సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలంటున్న పురపాలికలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాయి. వంద శాతం పన్నులను రాబట్టటమే లక్ష్యంగా విశ్వప్రయత్నం చేస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈలోపు లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు తగిన కార్యాచరణతో చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ప్రతీ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా దాదాపు మూడు నెలలు వసూళ్లు మందగించాయి. ఇంకా మూడునెలల సమయమే మిగిలి ఉండటంతో ఈలోపు లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా కృషి చేస్తున్నారు.

పన్నుల వసూలు ఇలా..

జిల్లాలో నిజాంపేట, పీర్జాదిగూడ,బోడుప్పల్,జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు మేడ్చల్,ఘట్కేసర్,పోచారం,తూముకుంట,నాగారం,గుండ్లపోచంపల్లి,దమ్మాయిగూడ,దుండిగల్,కొంపెల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి.ఈ 13 పురపాలక సంఘాల్లో పన్నుల వసూళ్లు మొత్తం రూ.190 కోట్లు లక్ష్యంగా కాగా, ఇప్పటి వరకు రూ. 59 శాతం మాత్రమే పన్నులు వసూలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా పురపాలక యంత్రాంగం దాదాపు మూడు నెలల పాటు పన్నుల వసూళ్లకు ఫుల్ స్టాప్ పెట్టినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. ఆలోగా చెల్లిస్తే వడ్డీ ఉండదు. తర్వాత రెండు శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. గతేడాది ఎర్లీబర్డ్ పథకం కింద ముందుస్తుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ అవకాశమిచ్చినా... పెద్దగా స్పందన రాలేదు. గతేడాది ఒకటి,రెండు మినహాయించి మిగతా పురపాలికల్లో వంద శాతం పన్నులు వసూలు చేయలేదు. ఈ సారైనా లక్ష్యం చేరుకునేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా ...ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటేటా బకాయిలు పెరిగిపోతున్నాయి.

బకాయిలు పెరగడంతో ఇబ్బందులు

పురపాలికల్లో ఏటా సకాలంలో పన్నులు వసూలు కావటం లేదు. రూ. కోట్లల్లో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. దీనికితోడు సిబ్బంది జీతభత్యాలు సకాలంలో ఇవ్వని దుస్థితి నెలకొంటోంది. ప్రతినెలా 10లోపు సిబ్బందికి వేతనాలు అందుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నుంచి అధిగమించాలంటే పన్నులు సకాలంలో పన్నులు వసూలు కావాల్సి ఉంది.